సాక్షి చిత్తూరు

సోమవారం । 11 । నవంబర్ । 2024



నోట్ల తయారీ ముఠా అరెస్టు

దొంగనోట్లు తయారు చేసి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసి, నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఉత్తమ అయ్యోర్లు

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన గురువులను ఉత్తమసేవా అవార్డులు వరించాయి. - 8లో



స్టేడియం ఆక్రమణకు యత్నం

పుంగనూరులోని ఇండోర్ స్టేడియం కూల్చి, స్థలం ఆక్రమణకు యత్నించిన వారిని స్థానికులు అడ్డుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశం



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజక వర్గ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. చిత్తూరు నగరం, గుడిపాల, రూరల్ నాయకులతో సమావేశం నిర్వహించనున్నమన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి కార్యక్రమానికి రానున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టాక కరుణాకరరెడ్డి మొదటిసారి నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్నారు. పలు అంశాలపై ముఖ్యనాయకులతో చర్చ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులందరూ సమావేశానికి హాజరు కావాలని వివరించారు.

నేడు మైనారిటీ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు మైనారిటీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

14న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని ఈనెల 14న లెక్కించనున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

12 నుంచి పవిత్రోత్సవాలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటికో ఇంజినీర్

కేవలం 10 కుటుంబాలున్న ఆ కుగ్రామం మండల కేంద్రానికి విసిరేసినట్లుగా ఉంది. పాడుబడిన పెంకుటిళ్లు..పాత మిద్దెలతో కనిపించేది. ఆ గ్రామంలో అన్ని కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. అయితే కాలం మారింది. ఆ పల్లె యువతకు చదువుపై ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం అందింది. ప్రతి ఇంటా అక్షర దీపం వెలిగింది. ఫలితంగా ఇంటింటా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం తలుపుతట్టింది. ఈ ఉద్యోగం ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చింది. దాతృత్వాన్ని ఇనుమడింపజేసింది. ఇదే ఐరాల మండలం దామరగుంట ప్రత్యేకత.





దామరగుంట గ్రామం (ఇన్‌సెట్) ప్రాథమిక పాఠశాల

పల్లె 'కొలువు' దీరింది

- మండలానికి దూరంగా కుగ్రామం
- ఇప్పటికీ కానరాని బస్సు సౌకర్యం
- కష్టాలను అధిగమించి రాణించిన యువత
- ఉద్యోగి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి
- ఆదర్శంగా నిలుస్తున్న దామరగుంట

ఐరాల: మండలానికి చివరగా ఉన్న ఓ కుగ్రామం దామరగుంట. మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామంలో 20 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నారు. 10 ఇళ్లు ఉన్న గ్రామంలో చాలామంది ఉన్నత విద్యనభ్యసించి వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. కాణిపాకం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామానికి ఇప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడం ఒకింత బాధాకరం. వీటన్నింటినీ అధిగమించి దామరగుంట యువత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా రాణించడం విశేషం. ఒకప్పుడు ఆ గ్రామంలో పాడుబడిన పెంకుటిళ్లు..పాత మిద్దెలు మాత్రమే కనిపించేవి. అన్నీ వ్యవసాయాధారిత కుటుంబాలే. అయితే తాము పడిన కష్టాలు బిడ్డలు పడకూడదని తల్లిదండ్రులు నిశ్చయించుకున్నారు. వ్యవసాయం, పాడి ఆవుల ద్వారా వచ్చే ఆదాయంలో పైసాపైసా కూడబెట్టి తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. కన్నవారి ఆకాంక్షలు నెరవేరుస్తూ బిడ్డలు ఉన్నత స్థానాల్లో స్థిరపడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా కొందరు, హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో కొందరు రాణిస్తున్నారు. గ్రామంలో ఇంజినీర్లుగా స్థిరపడిన వారిని స్ఫూర్తిగా తీసుకుని జూనియర్లు కూడా ఇంజినీరింగ్ వైపు అడుగులు వేస్తున్నారు. రూ.లక్షల్లో వేతనాలు పొందుతూ ఆనంద జీవితానికి బాటలు వేసుకుంటున్నారు.



దామరగుంట పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు

పలు సేవా కార్యక్రమాలు

గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, అతని మిత్ర బృందం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసించింది. వారందరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. తాము సంపాదించిన మొత్తంలో కొంత గ్రామానికి మరికొంత పేద విద్యార్థులకు వెచ్చిస్తూ పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 15న తమ ఊరి ప్రాథమిక పాఠశాలకు రూ.50 వేల వ్యయంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



చెన్నైలో బ్లూబైనరీస్ కంపెనీ

సీనియర్ల స్ఫూర్తితో..



మా గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడిన సీనియర్ల స్ఫూర్తితో అనుకున్న లక్ష్యాన్ని సాధించాను. నాన్న నరసింహారెడ్డి, అమ్మ చరిత కష్టపడి ఇంజినీరింగ్ చదివించారు. ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకుని, ఆ దిశగా అడుగులు వేశాను. ఇంజినీరింగ్ పూర్తయిన తరువాత 2021లో చెన్నై టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.

– పృథ్వీ, దామరగుంట, ఐరాల

నాన్న కల సాకారం



సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే స్కిల్స్ పెంచుకోవాలి. అప్పుడే కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. నేను బీటెక్ సత్యభామ యూనివర్సిటీలో పూర్తి చేశాను. 2022లో బెంగళూరు కాగ్నిజెంట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాను. నాన్న కల సాకారమైనందుకు ఇంటిల్లిపాది ఎంతో సంతోషంగా ఉన్నారు. నాకు సంతృప్తిగా ఉంది.

– అజితరెడ్డి, దామరగుంట, ఐరాల

నా ఆలోచనకు తగ్గట్టు..



ఊర్లో అందరూ సాఫ్ట్‌వేర్లే. అందుకే వేరే రంగంలో రాణించాలనుకున్నా. అప్పుడు నా ఆలోచనకు తగ్గట్టుగా హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నా. వెంటనే డిప్లొమా చేసి, హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాను. కోర్సు పూర్తయిన వెంటనే ఓ స్టార్ హోటల్‌లో ఉద్యోగం పొందాను. ప్రస్తుతం విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాను. మంచి వేతనంతో సంతోషంగా ఉన్నాను.

– దుర్గాప్రసాద్, దామరగుంట, ఐరాల

ఇంజినీర్ అనేది నా కల



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది నాకు చిన్నప్పటి నుంచి కల. కానీ మాది మధ్య తరగతి, వ్యవసాయాధారిత ఉమ్మడి కుటుంబం. అందువల్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అప్పట్లో బడికి వెళ్లాలంటే మా ఊరి నుంచి ఒక కిలోమీటరు నడిచివెళ్లాలి. అక్కడి నుంచి బస్సు ఎక్కి పాఠశాలకు వెళ్లేవాళ్లం. మా నాన్న చంద్రారెడ్డి, అమ్మ రెడ్డెమ్మ కష్టపడి నన్ను బీటెక్‌లో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివించారు. 2007లో బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ క్రాఫ్ట్ టెక్నీషియన్‌గా చేరాను. ప్రస్తుతం బెంగళూరు సెయింట్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను.

– శేఖర్, దామరగుంట, ఐరాల

ఉపాధి కల్పనే లక్ష్యం



యువతకు ఉపాధి కల్పించడమే నా లక్ష్యం. బాల్యంలో నా విద్యాభ్యాసం బంగారుపాళెం లోని ఓ ప్రైవేటు స్కూల్లో సాగింది. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, బిట్స్ పిలానిలో ఎంఎస్ ఇన్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ కోర్సు చేశాను. తొలుతగా అమరరాజ, ఆ తరువాత పలు కంపెనీల్లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేశాను. 2017లో చెన్నైలో బ్లూ బైనరీస్ టెక్నాలజీ కంపెనీని ప్రారంభించాను. ఈ కంపెనీని పుణె, బెంగళూరు, త్రివేండ్రం, జర్మనీ, ఆస్ట్రేలియా, యూకే, యూఎస్‌ఏలో కూడా నడుపుతున్నాం. ప్రస్తుతం మా కంపెనీలో 600 మంది పనిచేస్తుండగా ఉమ్మడి జిల్లాలో 50 మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా అవకాశం కల్పించాం.

– ఎల్ఎం.కిషోర్, దామరగుంట, ఐరాల

చాలా సంతోషంగా ఉంది



బెంగళూరులో క్యాప్ జెమినీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. నాన్న మనోహర్‌రెడ్డి, అమ్మ రుక్మిణి వ్యవసాయ పనులు చేస్తూ కష్టపడి చదివించారు. వారు పడిన శ్రమకు ఈ రోజు చాలా ఆనందంగా ఉన్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా ఊరిలో చాలామంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడడంతో కుటుంబాలు ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాయి. నా లాంటి వారి స్ఫూర్తితో పలువురు ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో కల సాకారమైంది. నాకు చాలా సంతోషంగా ఉంది.

– తేజశ్విని, దామరగుంట, ఐరాల

దయాలసిస్ లేదయా..!

దయాలసిస్.. శరీరంలోని రక్తం పూర్తిగా శుద్ధి చేసి.. తిరిగి శరీరంలోకి ఎక్కించే ఈ వైద్యవిధానం ఒకప్పట్లో శ్రీమంతులకే పరిమితం. ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నా.. విపరీతమైన రద్దీ..అవసరం ఉన్నవారికి వంతు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకతో ఈ పరిస్థితి మారింది. 108 అంబులెన్స్‌ల్లో దయాలసిస్ రోగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. అయితే కూటమి సర్కారు ఆ సేవలను ఐదు నెలలుగా ఆపి వేసింది. ఫలితంగా రోగులు ఇక్కట్లు పడుతున్నారు.



దయాలసిస్ చేసుకుంటున్న బాధితులు(ఫైల్)



దయాలసిస్‌కు 108 బ్రేక్

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దయాలసిస్ బాధితులకు 108 వాహన సేవలు
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ సేవలు బంద్
- అవస్థలు పడుతున్న బాధితులు
- కొనసాగించాలని డిమాండ్

కాణిపాకం: ఆపద్బంధువుగా పేరుపొందిన 108 అంబులెన్స్‌లో దయాలసిస్ బాధితులకు అందుతున్న వైద్యసేవలకు కూటమి సర్కారు కోత పెట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కిడ్నీ బాధితులకు కొండంత భరోసానిచ్చింది. మెరుగైన వైద్య సేవలతో పాటు పింఛన్‌ను అందించింది. దయాలసిస్ చేసుకునే వారికి కరోనా వేళ 108 సేవలను అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్య సేవలకు కోతలు పెడుతూ వస్తోంది. ఇందులో భాగంగా దయాలసిస్ చేసుకునే కిడ్నీ బాధితులకు 108 అందిస్తున్న సేవలకు బ్రేక్ వేసింది. తద్వారా బాధితులు రాకపోకలకు అవస్థ పడుతున్నారు. తోడు వచ్చేవారు బాధితులపై చిందులేస్తున్నారు. రవాణా ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని బాధిత కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. యువతతోపాటు చిన్నపిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోంది. గ్యాస్ట్రిక్, పెయిన్ కిల్లర్ మందులు ఎక్కువగా వాడడం, కలుషిత నీరు తాగడం, మద్యం సేవించడం, తగినంత నీరు తీసుకోకపోవడంతో కిడ్నీ సమస్యలు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాకుండా పొగతాగడంతో రక్తపోటు పెరిగి అది కిడ్నీలపై ప్రభావం చూపుతోంది. యాంత్రిక జీవనంలో శారీరక శ్రమ లేకపోవడంతో ఊబకాయానికి దారి తీస్తుంది.

కరోనా సమయంలో..

కరోనా వ్యాప్తితో అన్ని సేవలు బంద్ అయ్యాయి. ప్రధానంగా వాహన రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇలాంటి తరుణంలో రానుపోను వాహనాలు దొరక్క దయాలసిస్ బాధితులు ఇక్కట్లు పడ్డారు. బాడుగకు వచ్చే వాహనాలు రూ.వేలల్లో చార్జీలు వసూలు చేయడంతో జేబులు తడుముకున్నారు. ఇలా కొన్ని రోజుల పాటు కొందరు దయాలసిస్‌కు దూరమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 108 సేవలను వినియోగించుకోవచ్చని ఆదేశాలు జారీ చేసింది. కరోనా కట్టడి తర్వాత కూడా బాధితుల రవాణా భారం ఉండకూడదని భావించి ఈ సేవలను కొనసాగించింది. ఫలితంగా బాధితులకు ఆర్థికంగా ఊరట కలిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సేవలను పూర్తిగా ఆపి వేసింది.

రాను పోను ఎలా..?

రెండు రోజుల క్రితం వరకు దయాలసిస్ అందిస్తున్న 108 వాహన సేవకు కూటమి ప్రభుత్వం బ్రేకులు వేసింది. దీంతో రెండు రోజులుగా దయాలసిస్ బాధితులు ఆస్పత్రికి రానుపోను ఇబ్బంది పడుతున్నారు. గతంలో తోడు వచ్చేవారు కాదు. ఇప్పుడు బాధితుడితో పాటు మరో వ్యక్తి రావాల్సి ఉంది. రవాణా చార్జీలు భారంగా మారుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అగచాట్లు తప్పడం లేదు. సమయానికి దయాలసిస్ సెంటర్‌కు చేరుకోలేకపోతున్నారు. ఆలస్యంగా వెళితే వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇలాంటి తరుణంలో 108 సేవలను మళ్లీ యథావిధిగా కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

అప్పటి టీడీపీ హయాంలో రోగుల పరిస్థితి దీనం

2019 సంవత్సరానికి ముందు దయాలసిస్ రోగుల పరిస్థితి దీనంగా ఉండేది. అయితే వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసానిచ్చింది. జిల్లాలో కిడ్నీ బాధితులు 387 మంది ఉన్నారు. వీరిలో 226 మంది దయాలసిస్ చేసుకుంటున్నారు. ఇందులో 36 మందికి పింఛన్ ఇవ్వాల్సి ఉంది. ఈ బాధితులంతా జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఈహెచ్ఎస్, పీఈఎస్, శ్రీప్రియ నర్సింగ్ హోమ్, ఆర్‌వీఎస్, తిరుపతి, బంగారుపాళెంలోని ఆస్పత్రుల్లో దయాలసిస్ చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసినా ఆ నగదు మందులు, మాత్రలు, ఇంజెక్షన్లకు సరిపోతోంది. ఇతరత్రా ఖర్చులకు వారు అప్పులు చేయాల్సి వస్తోంది. జిల్లా నుంచి తిరుపతికి వెళ్లి దయాలసిస్ చేసుకునే వారికి రవాణా ఖర్చులు అదనపు భారంగా మారుతోంది. దీనికితోడు కరోనా వ్యాప్తి తోడైంది. ఇలాంటి తరుణంలో దయాలసిస్ బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది.

ఉన్నట్టుండి ఆపేస్తే ఎలా..



కిడ్నీ బాధితులు కుటుంబ సభ్యులు అప్పో సప్పో చేసి దయాలసిస్‌కు వస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ మందులు, మాత్రలకు సరిపోతోంది. ఇంజెక్షన్ ఇతరత్రా ఖర్చులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. డబ్బులు ఉండే వారు ఆటో, కారు, టూవీలర్‌లోనో వస్తారు. లేని వాళ్ల పరిస్థితి ఇబ్బందే కదా. ఉన్నట్టుండి 108 సేవలను దయాలసిస్ వాళ్లకు ఆపేయడం కరెక్ట్ కాదు. వెంటనే మళ్లీ ఆ సేవలను కొనసాగించాలి.

–పురుషోత్తం, కాణిపాకం

రవాణా భారం ఉండేది కాదు



ముందు 108 ద్వారా తీసుకొస్తున్నారు. ఇప్పుడు బండి రావడం లేదు. ఫోన్ చేస్తే ఆ సమయానికి బండి ఎక్కడ ఉందో చెప్పే వాళ్లు. దయాలసిస్ చేసుకుని ఇంటికి తీసుకెళ్లే వాళ్లం. ఇప్పుడు బండి ఆపేస్తే మాలాంటి వాళ్లు ఏం చేయాలి. ఆర్థికంగా ఇబ్బంది పడే వారికి ఇబ్బంది. మేము బంగారుపాళెం నుంచి ఆటోలో రావాలంటే రూ.500పై డబ్బులు తీసుకుంటున్నారు. పేదలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ ఆ సేవను పునరుద్ధరించాలి.

–శ్యామల, బంగారుపాళెం

కాణిపాకం కిటకిట

కాణిపాకం:శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ అలానే కొనసాగింది. ఉచిత దర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనంతో పాటు వీఐపీ దర్శన క్యూలన్నీ కూడా కిక్కిరిసిపోయాయి. దర్శనానికి గంటకుపైగా భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. అయితే భక్తులు ఇబ్బందులు లేకుండా స్వామిని దర్శించుకునేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

రసవత్తరం.. కుస్తీ పోటీలు

యాదమరి(పూతలపట్టు):యాదమరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. తొలిరోజు శనివారం ఆడి గెలుపొందిన వారు ఆదివారం రెండో రౌండ్ ఆడారు. ఈ పోటీలను మండల నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తిలకిస్తున్నారు. ప్రధానంగా బాలికలు తలపడుతున్న తీరు చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. మొత్తం బాలురు130, బాలికలు 130, కోచ్‌లు 26 మందితో కలిపి 286 మంది ఈ క్రీడా పోటీలకు హాజరయ్యారు. వీరి సేవలకు ఆరుగురు ఆశా వర్కర్లను అందుబాటులో ఉంచారు.

ఫైనల్ పోటీలకు సిద్ధం

ఆదివారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు సోమవారం నిర్వహించే ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లు క్రీడాకారుల బరువు ప్రకారం నిర్వహించారు. రోహిత్(నెల్లూరు), ధనంజయరావు(శ్రీకాకుళం), జయకృష్ణ(శ్రీకాకుళం), హేమచంద్ర(చిత్తూరు), చరణ్(గుంటూరు), మహేష్ (కర్నూల్), వెంకటశ్రీహరి(ప్రకాశం), ముకేష్(చిత్తూ రు), హర్షవర్ధన్(చిత్తూరు) ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నారు. బాలికలు పూజా(గుంటూరు), రాణి(శ్రీకాకుళం) తదితరులు ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం ఉదయం నిర్వహించే ఫైనల్ పోటీలకు జిల్లా విద్యాశాఖాధికారి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడారులలో 60% జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడారారులే ఉండడం విశేషం.

అన్నం ముద్దగా ఉంది

రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భోజనం సరిగా లేదంటూ క్రీడాకారులు, కోచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్నం ముద్దగా ఉందని, సాంబార్, రసం వంటివి పెడుతున్నట్లు వాపోయారు. స్కూల్ గేమ్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వం ఒక్కో క్రీడాకారునికి రూ.150 భోజనం ఖర్చు కోసం వెచ్చిస్తోంది. మరి ఎందుకు ఆ విధంగా భోజనం పెట్టడం లేదని సీనియర్ పీడీలు నిర్వాహకులను ప్రశ్నించగా ఆదివారం క్రీడాకారులకు చికెన్, కోడి గుడ్డుతోపాటు మంచి భోజనం పెట్టారు.



రెజ్లింగ్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు



తలపడుతున్న బాలికలు

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరు అయ్యే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పక్కన్న ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

వీఆర్‌కు కుప్పం సీఐ

కుప్పం: కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడును వీఆర్‌కు పంపించారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న జీటీ నాయుడు ఈ జూన్‌లో కుప్పం అర్బన్ సీఐగా బదిలీపై వచ్చారు. అధికార పార్టీ నేతలకు సీఐకి మధ్య విభేదాలు రావడంతో ఆయనపై పలు ఫిర్యాదులు వెళ్లాయి. స్థానిక టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు ఆయన్ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్‌ను ఇన్‌చార్జి అర్బన్ సీఐగా నియమించారు.

సేవల్లో దిట్ట శ్రీధర్



గంగవరం మండలం మేలుమాయి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న శ్రీధర్‌బాబు సేవాకార్యక్రమాల్లో దిట్ట. ఆయన విధులు నిర్వహించిన ప్రతి పాఠశాల బలోపేతానికి కృషి చేసి మన్ననలు అందుకున్నారు. 2002–08లో పొన్నమాకులపల్లె, 2009–15లో నెల్లిపట్ల బడుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రూ.10 లక్షల వరకు విరాళాలు సేకరించి పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేశారు. 2015–21 మధ్యకాలంలో పత్తికొండ జెడ్పీ హైస్కూల్‌లో రూ.80 లక్షల విరాళాలు సేకరించి ఆ పాఠశాల రూపురేఖలు మార్చేందుకు కృషి చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, విహార, విజ్ఞానయాత్రలు, సంగీతం, భరతనాట్యం, కంప్యూటర్ విద్యను అందించారు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులు ఎన్ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చారు.

బోధనలో మేటి సురేంద్రబాబు



సుదీర్ఘ బోధనానుభవం. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠశాలు బోధించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడేలా కృషి చేశారు ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్ బయాలజీ టీచర్ సురేంద్రబాబు. సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు విభిన్న ఉపకరణాలను వినియోగించేవారు. ఆయన పనిచేసిన ప్రతి పాఠశాల నుంచి ఇప్పటి వరకు 100 మంది పేద విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యేలా ఉచిత శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, 120 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యేలా కృషి చేశారు. ఆయన పనిచేసిన పాఠశాలల్లో సైన్సు ల్యాబ్‌ల అభివృద్ధి కోసం రూ.1 లక్ష వరకు సొంత నిధులను ఖర్చు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచుతుందన్నారు.

పేద విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు అందజేస్తున్న శ్రీధర్ బాబు (ఫైల్)



ఉత్తమ అయ్యోర్లు

- రాష్ట్ర స్థాయి అవార్డులకు ఉత్తమ ఉపాధ్యాయులు
- నేడు విజయవాడలో అవార్డు అందుకోనున్న ఉపాధ్యాయులు
- అంకిత భావంతో విధుల నిర్వహణకు దక్కిన అవార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ప్రకటించే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ సారి జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పాఠశాల విద్య నుంచి జిల్లాలోని గంగవరం మండలం మేలుమాయి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీధర్‌బాబు, ఐరాల మండలం కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న బయాలజికల్ సైన్స్ టీచర్ సురేంద్రబాబు ఎంపికయ్యారు. రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా వి.కోట ఉర్దూ జెడ్పీ హైస్కూల్ టీచర్ మహమ్మద్ అలీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఎంపిక చేసింది. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కు సంబంధించి జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి బాలికల జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్ గా పనిచేస్తున్న శ్రీదేవి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 11వ తేదీ సోమవారం విజయవాడలో సీఎం చేతుల మీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.

ముస్లిం విద్యార్థుల అభివృద్ధికి అలీ కృషి



జిల్లాలోని వి.కోట మండల కేంద్రంలోని ఉర్దూ జెడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మహమ్మద్ అలీ ముస్లిం విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఆ డ్రైవ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ముస్లిం పిల్లలను ఉన్నత చదువులు చదివేలా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రతి ఏటా పదవ తరగతి విద్యార్థులు గణితంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ తనకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తాను మరింత కష్టపడి పేద విద్యార్థులకు ఉత్తమ బోధన చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

పిల్లలే శ్రీదేవి లోకం



జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవికి పిల్లలే లోకం. ఆమె 2000లో స్కూల్ అసిస్టెంట్‌గా ఏ.రంగంపేట జెడ్పీ హైస్కూల్‌లో మొదటి ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు.. ఆ తర్వాత 2012లో ఏపీపీఎస్సీ పరీక్షలో ఎంపికై జూనియర్ లెక్చరర్‌గా విధుల్లో చేరారు. 2008లో ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. ఆమె ప్రతి ఏటా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా నాలుగేళ్లపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు తన సొంత నిధులతో నగదు బహుమతులు, విద్యాసామగ్రి అందజేస్తారు. మధ్యలో చదువు మానేసిన బాలికలను తిరిగి కళాశాలలో చేర్పించేందుకు నిరంతరం కృషి చేస్తుంటారు. ఆమె సేవలకుగానూ ఈ అవార్డు దక్కింది.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రెవెన్యూ శాఖలో విధుల నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రెవెన్యూ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం ఆ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికైన నూతన జిల్లా అధ్యక్షులు హుస్సేన్ (తహసీల్దార్, సదుం) మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రెండవ సారి జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ ఉద్యోగులు ఏవైనా సమస్యలున్నట్లైతే సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇలా

జిల్లా అధ్యక్షులుగా ఎస్ఎం. హుస్సేన్, పార్థసారథి (అసోసియేట్ అధ్యక్షులు), ఇబ్రహీం (ఉపాధ్యక్షులు–1), సరిత (ఉపాధ్యక్షులు–2), అశోక్ (ఉపాధ్యక్షులు–3), పన్నీర్ సెల్వం (ట్రెజరర్), సుధాకర్ (జనరల్ సెక్రటరీ), చంద్రశేఖర్ (జాయింట్ సెక్రటరీ–1), కిరణ్‌కుమార్ (జాయింట్ సెక్రటరీ–2), జీవరత్నం (జాయింట్ సెక్రటరీ–3), గోపీనాథ్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), ప్రవీన్ కుమార్, మహేశ్వరి, మధుసూధన్, పణికుమార్ (ఈసీ మెంబర్) ఎన్నికైనట్లు వెల్లడించారు.



రెవెన్యూ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

ఇండోర్‌స్టేడియం ఆక్రమణకు ప్రయత్నాలు



పుంగనూరులో ఘర్షణ పడుతున్న కూటమి నాయకులు



ఇండోర్ స్టేడియంను కూల్చివేసిన దృశ్యం (ఫైల్)

పుంగనూరు: పట్టణంలో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్‌స్టేడియాన్ని కూటమి సభ్యులు అర్ధరాత్రి కూల్చేశారు. ఈ సంఘటన నుంచి పట్టణ ప్రజలు తేరుకోక ముందే ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఆదివారం జేసీబీలతో కట్టడాలను తొలగిస్తుండగా కమిటీ సభ్యులు, ప్రజలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. భూమి పట్టణ ప్రజల కోసం కేటాయించగా అందులో పట్టణ ప్రజల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మించామని కమిటీ సభ్యులు వెల్లడించారు. అయితే కూటమికి చెందిన పూలప్రేమకుమార్, కుటుంబ సభ్యులు భూమి తమదంటూ భవన శిథిలాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. నాలుగు నెలలుగా కూల్చివేతకు బాధ్యులైన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పూలప్రేమకుమార్ కుటుంబ సభ్యులు శిథిలాలు తొలగించే కార్యక్రమం చేపట్టడం, భూమి తమదేనంటూ ప్రకటించడంతో ఇండోర్ స్టేడియాన్ని కూల్చివేసింది తామేనని చెప్పినట్లయింది. ఈ నేపథ్యంలో పోలీసులు స్టేడియం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటారా...లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఆస్తి తగాదాల పరిష్కారం కోసం వచ్చి..

- బైక్‌ను ఢీకొట్టి లాక్కెళ్లిన టెంపో వాహనం
- అక్కడికక్కడే మృతి చెందిన యువకుడు



నందకుమార్ (ఫైల్)

గంగవరం: ఆస్తి తగాదాల పరిష్కారం కోసం వచ్చిన యువకుడు బైక్‌పై వెళుతుండగా, టెంపో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని గుండుగల్లు గ్రామానికి చెందిన శంకరప్ప కుమారుడు నందకుమార్(36) విజయవాడలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన భార్య, మూడేళ్ల కొడుకుతో కలిసి అక్కడే స్థిరపడ్డారు. గ్రామంలో ఆస్తి తగాదాల పరిష్కారం కోసం గత శుక్రవారం గుండుగల్లుకి ఒంటరిగా వచ్చాడు. ఉదయం పని మీద గ్రామం నుంచి గంగ్రాజుపల్లెకు బైక్‌మీద వెళ్లాడు. అక్కడ బైక్ టైర్ పంక్చర్ వేసుకుని ఆలకుప్పం వద్ద రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా, చెన్నై నుంచి కర్ణాటకకు వెళుతున్న ఈచర్ టెంపో వాహనం వేగంగా అతన్ని ఢీకొట్టి, కొంతదూరం బైక్‌ను లాక్కెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నందకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టెంపో డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో తన భర్త మరణ వార్త తెలుసుకున్న భార్య గౌతమి విజయవాడ నుంచి మూడేళ్ల బిడ్డతో గుండుగల్లుకి చేరుకుంది. విగతజీవిగా ఉన్న భర్తను చూసి భార్య, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

మొగిలి చెక్‌పోస్టును ఢీకొన్న లారీ





పోలీస్ చెక్‌పోస్టుపైకి దూసుకెళ్లి, బోల్తాపడిన లారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో దొరచెరువు వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం లారీ అదుపు తప్పి చెక్‌పోస్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విధినిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. మైసూరు నుంచి తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి పొగాకు లోడ్‌తో వెళుతున్న లారీ దొరచెరువు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి చెక్‌పోస్టును ఢీకొంది. పక్కనే పోలీసుల కోసం ఏర్పాటు చేసిన ఔట్ పోస్టు (కంటైనర్)పైకి దూసుకు వచ్చి బోల్తాపడింది. దీంతో చెక్‌పోస్టు వద్ద వాహనాల వేగ నియంత్రణ కోసం విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, హోంగార్డు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు కానీ ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. లారీ డ్రైవర్ క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. డ్రైవర్ మద్యం తాగి లారీ నడిపినట్లు పోలీసులు చెబుతున్నారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణ కోసం అధికారులు అన్ని విధాలా చర్యలు తీసుకున్నప్పటికీ నియంత్రణ కావడం లేదు.

భయంతోనే విధులు

మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొగిలి ఘాట్ సమీపంలో గల దొరచెరువు వద్ద వాహనాల వేగ నియంత్రణ కోసం నెల క్రితం చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది అక్కడే ఉంటూ వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని సూచనలు చేస్తున్నారు. అయితే వాహనదారులు వేగంగా నడుపుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడ విధులు నిర్వహించాలంటే భయంగా ఉందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత చిత్తూరు



బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న చిత్తూరు జట్టు

నగరి : స్కూల్ గేమ్ ఫెడరేషన్ తరపున రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలుర బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచినట్లు జట్టు కోచ్ గోపి తెలిపారు. ఆదివారం జరిగిన పోటీల్లో జిల్లా జట్టు అత్యంత ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 13 జిల్లాల జట్లు ఈ పోటీలో పాల్గొన్నట్టు తెలిపారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం దక్కించుకుందన్నారు. జట్టు క్రీడాకారులు కేసీ తేజేష్, ఎఫ్.ఇక్బాజ్ అహ్మద్, పి.భానుప్రకాష్, ఎస్.రక్షణ్, కె.సిద్దిక్, సి.జశ్వంత్, ఓ.అభినేష్, నేత్రసాయి, మోహిత్‌కుమార్, వెంకట్‌ను ఎస్‌జీఎఫ్ సిబ్బంది అభినందించారు.

జాతీయ జట్టుకు ముగ్గురు ఎంపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు నుంచి నగరిలోని శ్రీ సాయి వివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన కేసీ తేజేష్, ఎఫ్.ఇక్బాజ్ అహ్మద్, శ్రీకాళహస్తి ఆర్డీబీఎస్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. వెంకట్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు.

బొజ్జమ్మను తొలగించాలని నిరసన



నిరసన తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

పలమనేరు: రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించిన బొజ్జమ్మ వాల్మీకి కులస్తురాలు కాదని, వెంటనే ఆ పదవి నుంచి ఆమెను తొలగించాలని స్థానిక వాల్మీకి కుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఆదివారం సంఘ సభ్యుల నిరసన తెలిపారు. సంఘం నేత ఎల్ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వాల్మీకుల సమస్యలపై పోరాడుతున్న తమ కులం వాళ్లను కాకుండా పాల ఏకరి కులానికి చెందని వారిని నియమించడం సబబు కాదన్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం బోయ, వాల్మీకి కులాల తమ హక్కుల కోసం పోరాడకుండా తొక్కివేసినట్టేనని భావించాలన్నారు. ఇప్పటికైనా వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ పదవిని తమ కులంవాళ్లకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీనిపై పోరాటం చేస్తామన్నారు. ఆ సంఘం నేతలు నాగరాజు, గంగప్ప, సుబ్రమణ్యం, రామచంద్ర, మునస్వామి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,558 మంది స్వామివారిని దర్శించుకోగా 32,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దొంగ నోట్ల తయారీ ముఠా అరెస్ట్!

- తిరుపతిలోని ఇల్లే తయారీ కేంద్రం
- గత 3 నెలల్లో రూ.10 లక్షలు చలామణి
- నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు
- ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, స్కానర్, ల్యామినేషన్ మిషన్‌తో పాటు 29 వస్తువులు, వోక్స్‌వాగన్ కారు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రవికుమార్

పుత్తూరు: పట్టణంలో శనివారం సాయంత్రం రూ.500 దొంగనోట్లను మారుస్తూ పట్టుబడిన తండ్రీ కూతుర్ల ముఠాను ఆదివారం పుత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జి.రవికుమార్ మీడియాకు వెల్లడించారు. పట్టుబడిన తండ్రీ కూతుళ్లు ఆర్. రమేష్(44), ఆర్.ఇషా(25ను విచారించగా ముఠా గుట్టు బయట పడింది. తిరుపతి చెర్లోపల్లిలోని తులిప్ రెసిడెన్సీ వద్ద గల ఆర్.రమేష్ తన ఇంటిలోనే భార్య ఆర్.సంధ్య(40), కూతురు నిషా(25), స్నేహితుడు మునికృష్ణారావు(32)తో కలిసి దొంగనోట్ల తయారీని చేపట్టారు. యూట్యూబ్ చానల్ ద్వారా దొంగనోట్లను తయారు చేసే విధానాన్ని నేర్చుకొని, అందుకు తగిన పరికరాలను సమకూర్చుకున్నారు. రెండు నెలల పాటు దొంగనోట్ల తయారీ ప్రాక్టీసు చేసి పరిపూర్ణత (క్వాలిటీ) సాధించారు. అనంతరం మూడు నెలల్లో రూ.500 నోట్లను సుమారు రూ.10 లక్షల మేరకు తయారు చేశారు. వీటిని తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు, వెంకటగిరి, చిత్తూరులో చలామణి చేశారు. చివరగా పుత్తూరులో పట్టుబడ్డారు. వీరు దొంగనోట్లు తయారు చేయడానికి స్టాక్ మార్కెట్‌లో షేర్లు కొనుగోలు చేసి నష్టపోవడం, చేసిన అప్పులు తీర్చడానికి, ఆర్థిక ఇబ్బందులు అధిగమించడానికి ఈ దారిని ఎంచుకున్నారు. వీరి నుంచి వంద రూపాయల (192) నోట్లు కలిగిన కట్ చేయని 48 షీట్లు, ఐదు వందల రూపాయల (156) నోట్లు కలిగిన కట్ చేయని 39 షీట్ల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నోట్ల తయారీకి అవసరమైన 29 రకాల పరికరాలతో పాటు వోక్స్ వాగన్ కారును స్వాధీనం చేసుకొన్నారు. పుత్తూరులోని నిర్మల ప్రొవిజనల్ స్టోర్ యజమాని కె.కుప్పయ్యశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన నలుగురుని పుత్తూరు కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కెబి సురేంద్రనాయుడు, ఎస్ఐ ఓబయ్య, క్రైమ్ ఏఎస్ఐ డిబి రాజు, దామోదరమ్ పాల్గొన్నారు.



పోలీసులు సీజ్ చేసిన నకిలీ నోట్లు, పరికరాలు